కాల్వ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 23(ఆంధ్రజ్యోతి): వరదనీటి కాల్వ టన్నెల్ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సూచించారు. సరూర్‌నగర్ చెరువుకట్ట నుండి కోదండరామ్‌నగర్‌కాలనీ హస్సేన్ మటన్ దుకాణం వరకు జరుగుతున్న టన్నెల్ నిర్మాణ పనులను కోదండరామ్‌నగర్ ఫ్లడ్ జేఏసీ సభ్యులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టన్నెల్ నిర్మాణ పనుల తీరును వారికి కార్పొరేటర్ వివరించారు. కార్యక్రమంలో కోదండరామ్‌నగర్ ఫ్లడ్ జేఏసీ సభ్యులు శ్రవణ్, చైతన్యకుమార్, సునీల్‌బాబు, గిరీష్, టింకు పాల్గొన్నారు.

శృంగేరి కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): శృంగేరి కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం కాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాలనీ నూతన కమిటీ సభ్యులు కాలనీలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిపడా తాగునీరు సరఫరా అయ్యేందుకు, తరచూ తలెత్తే డ్రైనేజీ లీకేజీ సమస్య పరిష్కారానికి జలమండలి అధికారులను సంప్రదిస్తామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమను సంప్రదించాలని సూచించారు.

మన్సూరాబాద్ డివిజన్‌లో పర్యటించిన కార్పొరేటర్



రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

హయత్‌నగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శివగంగకాలనీ, వీరన్నగుట్ట, సాయినగర్‌కాలనీ, వరదానగర్, ఆర్టీసీకాలనీ, సీఎస్ఆర్‌కాలనీలలో సంక్షేమ సంఘం నాయకులతో కలిసి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆదివారం పర్యటించారు. సీఎస్ఆర్‌కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించి నాణ్యతతో పనులు చేయాలని కోరారు. వరదానగర్, శివగంగా కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురవుతుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆయన జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ చేసి పార్కు స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షేమ సంఘం నాయకులు శ్రీశైలం, నరేష్, బాబురావు, శ్రీధర్‌రెడ్డి, నర్సింహయాదవ్, కోటయ్య, సత్యం పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను కలిసిన బీజేపీ, బీజేవైఎం నేతలు

చంపాపేట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు, చంపాపేటకు చెందిన సిల్వేరు అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు బీజేపీ నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాల కిందట గుర్రంపోడులో జరిగిన సంఘటనలో 54రోజుల పాటు జైలుకు వెళ్లిన సిల్వేరు అనీల్‌కుమార్‌ను ఎంపీ ఘనంగా సన్మానించి అభినందించారు. నాయకులు పాశం శ్రీశైలం, టింగ్లీకర్ రాజేష్, భానుక రమేష్, పీఠం ప్రదీప్, శ్రీనివాసనాయుడు, ఢిల్లీ వెంకటేష్, పవన్‌కుమార్, విష్ణు, రవీందర్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా సమితి భవనానికి భూమి పూజ

సరూర్‌నగర్, జూన్ 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో నూతనంగా చేపట్టనున్న అయ్యప్ప సేవా సమితి భవనం నిర్మాణ పనులకు ఆదివారం అంకురార్పణ చేశారు. గ్రామ పెద్దలు, పలు పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి బడంగ్‌పేట్ నగరపంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్, బండారి మనోహర్, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, కొలన్ తిరుపతిరెడ్డి, స్థానిక నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, మల్లారెడ్డి, ఇక్కె శ్రీశైలం, కొప్పుల రాజు పాల్గొన్నారు.

మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజు



సరూర్‌నగర్, జూన్ 23(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్‌లోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ రాచకొండ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి దాకా మీర్‌పేట్‌లో ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన కాశీవిశ్వనాథ్ స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్న నాగరాజును నియమించారు. కాశీవిశ్వనాథ్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. నాగరాజు మీర్‌పేట్ ఎస్‌హెచ్‌వోగా శనివారం రాత్రి పొద్దుపోయాక బాధ్యతలు స్వీకరించారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అనంతుల సురేందర్‌రెడ్డి

కొత్తపేట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్నేహపురి కాలనీ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా 7వ సారి ఎన్నికైన అనంతుల సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నికల నిర్వహణాధికారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా ఎస్.దశరథ్‌రెడ్డి, రామకృష్ణారావు, కేవీఆర్ఎస్ మూర్తి, కార్యదర్శిగా జే.లక్ష్మీకాంతారావు, కోశాధికారిగా డీవీ.రామారావు, సంయుక్త కార్యదర్శులుగా కళ్యాణి, వేణుమాధవ్, ఆర్.యాదగిరిరావు, ఎన్.రాజేశ్వరి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కే.మురళీమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణమూర్తి(బాబ్జీ), అనంతుల లక్ష్మారెడ్డి, కే.వీరానంది, డీవీపీ రవికుమార్ తదితరులు వ్యవహరిస్తారని సురేందర్‌రెడ్డి తెలిపారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి సహకరిస్తున్న జలమండలి ఏఈ రామకృష్ణారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాలచారిలను సన్మానించారు.

గుంతను పూడ్చిన ఆటో డ్రైవర్లు



రోడ్డుపైన ఏర్పడిన ప్రమాదకరమైన గుంతను పూడుస్తున్న ఆటో డ్రైవర్లు

హయత్‌నగర్: మన్సూరాబాద్ డివిజన్‌లోని కొలను శివారెడ్డికాలనీ ముందు కుంట్లూర్ రోడ్డులో ప్రమాదకరంగా తయారు అయిన కాల్వను కుంట్లూర్ ఆటో యూనియన్ నాయకులు ఆదివారం పూడ్చివేశారు. ద్విచక్ర వాహనదారులంత కాల్వలో పడుతుండడం చూసిన కుంట్లురు ఆటో డ్రైవర్‌లు ఆదివారం ఆటోల్లో మట్టిని తీసుకువచ్చి కాల్వను పూడ్చివేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మూడు నెలల క్రితం రోడ్డుపైన నెట్ కేబుల్ కోసం కాల్వను తీసి మట్టితో పూడ్చివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి రోడ్డు పొడవునా కాల్వలా గుంత ఏర్పడింది. వాహనదారులు దగ్గరికి వచ్చే వరకు కూడా గుంత కనిపించక అందులో పడుతున్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరామ్‌నగర్‌కాలనీ అలమేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు రెండు రోజులుగా కనులపండువగా జరుగుతున్నవి. బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాతసేవతో పూజ కార్యక్రమాలను ప్రారంభించారు. ఆదివారం పూజ కార్యక్రమాల్లో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

సత్యనారాయణస్వామి ఆలయంలో..

లలితానగర్‌లోని గడ్డిఅన్నవరక్షేత్ర వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం 5గంటల నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలను మొదలుపెట్టారు. విష్ణుసహస్రనామ పారాయణం, విష్వక్సేనఆరాధన, పుణ్యాహవాచనము, రక్షాబంధనము, అంకురార్పణ, ధ్వజపటాధివాసం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహగుప్తా వెల్లడించారు.

దంచికొట్టిన వర్షం

- వాహనాల రాకపోకలకు అంతరాయం
- పలు కాలనీల్లోకి చేరిన వరదనీరు

వనస్థలిపురం, జూన్ 23(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లో ఆదివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. వర్షానికి పలు కాలనీలు, రహదారులు జలమయం అయ్యాయి. దీంతో చింతలకుంట, వనస్థలిపురం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ సిబ్బంది సకాలంలో స్పందించి వరదనీరును మ్యాన్ హోల్స్ ద్వారా తరలించారు. అదేవిధంగా బీఎన్‌రెడ్డినగర్‌లోని లోతట్టు ప్రాంతమైన గౌతమినగర్ కాలనీలోకి వరదనీరు చేరడంతో కాలనీ రహదారులు చెరువును తలపించింది. మున్సిపల్ సిబ్బంది వరదనీటి తరలింపు చర్యలు చేపట్టి నాలాల ద్వారా వరదనీరును పంపించారు. వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో నిలిచిన వరదనీరును జేసీబీ సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. వర్షపునీరు నిలిచిన కాలనీలలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి పర్యటించారు.



వర్షానికి చింతలకుంటలోని ప్రధాన రహదారిపై స్తంభించిన వాహనాల రాకపోకలు



ఓల్డ్ మలక్‌పేట పోచమ్మ ఆలయం వద్ద వరదనీరు



మలక్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలోని ఆర్‌యూబీలో వరద ప్రవాహం

మలక్‌పేటలో వరద ప్రవాహం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి మలక్‌పేటలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. మలక్‌పేట మార్కెట్ ముందున్న న్యూమార్కెట్ మెట్రోస్టేషన్ కింద, అక్షయ్ హోటల్ వద్ద, మలక్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్‌యూబీ రోడ్డులో, మూసారాంబాగ్ బ్రిడ్జిపై వరద ప్రవాహంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వరద కారణంగా భారీ వాహనాలు మాత్రమే నడవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు నిలిచిపోయాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ రంగంలోకి వరద నివారణకు చర్యలు చేపట్టారు.



మలక్‌పేటలో వరదనీటిలో కొట్టుకుపోతున్న టూవీలర్

ఓల్డ్ మలక్‌పేటలో..

ఓల్డ్ మలక్‌పేట: ఓల్డ్ మలక్‌పేటలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షం దాటికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పైన ఉన్న యశోద ఆస్పత్రి వైపు నుంచి వస్తున్న వరద పోచమ్మ ఆలయం ముందు చేరి కుంటను తలపిస్తుంది. ఆలయం ఆవరణ మొత్తం వరద నీటితో జలమయమైంది. చాదర్‌ఘాట్ సర్కిల్ నుంచి నల్గొండ చౌరస్తా వరకు ట్రాఫిక్‌జాం అయింది. మున్సిపల్ కాలనీలో వరద ఉధృతికి రోడ్డు మీద నిలిపి ఉన్న టూవీలర్ కొట్టుకు పోతుండడంతో అక్కడ ఉన్న యువకులు టూవీలర్‌ను బయటకు తీశారు. ఓల్డ్ మలక్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, నాంచారమ్మ దేవాలయం ప్రాంతాల్లో రోడ్లన్ని వరద కాల్వల్లా మారాయి.

బడంగ్‌పేట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- ఐటీశాఖ మంత్రికి మేయర్ పారిజాతారెడ్డి వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో అనేక సమస్యలు పెండింగులో ఉన్నాయని, వాటి పరిష్కారానికి హెచ్ఎండీయే నిధులు కేటాయించి ఆదుకోవాలని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. ఆదివారం ఆమె మంత్రిని ఆయన నివాసంలో కలిసి బడంగ్‌పేట్‌లోని సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్పొరేషన్ పరిధి విస్తృతంగా ఉన్నందున అందుబాటులో ఉన్న నిధులతో అన్ని పనులనూ చేయలేకపోతున్నామని, కార్పొరేషన్‌లో నిధులు సైతం సరిపోయినంతగా లేవని ఆమె మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హెచ్ఎండీయే నిధులతో పాటు ప్రత్యేక నిధులు కూడా మంజూరు చేస్తేనే ప్రజా సమస్యలను పరిష్కరించగలుగుతామని ఆమె అన్నారు. కుర్మల్‌గూడ 10వ డివిజన్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలో తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని మేయర్ మంత్రిని కోరారు. దీనికి శ్రీధర్‌బాబు స్పందిస్తూ నిధులు మంజూరు, తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు.

పెద్దచెరువును సుందరీకరిస్తాం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 23(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ పెద్ద చెరువును అన్ని విధాలుగా సుందరీకరణ చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని పెద్ద చెరువు, సరస్వతినగర్, కాస్మోపాలిటిన్ కాలనీల్లో కాలనీవాసులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం మార్నింగ్‌వాక్ చేపట్టి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దచెరువులోకి డ్రైనేజీ నీరు కలవడంతో దుర్వాసన వస్తుందని, వాకింగ్‌కు వచ్చే వారికి ఇబ్బందులవుతున్నాయని, డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. అదేవిధంగా శ్రీసరస్వతినగర్‌కాలనీ, కాస్మోపాలిటిన్ కాలనీల్లో నూతన డ్రైన్ పనులు చేపట్టాలని, కాస్మోపాలిటిన్ కాలనీలోని పార్కు గోడ ఎత్తు పెంచాలని ఎమ్మెల్యేను కాలనీవాసులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దచెరువును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ చెరువు వద్దకు వచ్చి సేదతీరే విధంగా సుందరీకరణ పనులు చేపడతామని తెలిపారు. చెరువులోకి డ్రైనేజీ నీరు రాకుండ పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, జగదీశ్‌యాదవ్, విజయ్ భాస్కర్‌రెడ్డి, జగదీశ్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో కలిసి మార్నింగ్‌వాక్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం

హయత్‌నగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఏక కాలంలో రైతు రుణ మాఫీ రూ. 2లక్షలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ ఆదివారం తుర్కయంజాల్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ మున్సిపాలిటీ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మశివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముందుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, కౌన్సిలర్‌లు రవీందర్‌రెడ్డి, సునీల్, కాంగ్రెస్ నాయకులు సామ భీంరెడ్డి, జుల్ ఖాదర్‌అలీ, నర్సింహ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: రైతు రుణమాఫీకి మంత్రివర్గం ఆమోదం తెలుపడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ రైతు సంఘం అధ్యక్షుడు సిద్దంకి మోహన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ చెక్‌పోస్టు వద్ద విజయవాడ జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యులు నారాయణరెడ్డి, పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. ఏక కాలంలో రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చామ కృష్ణారెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, రాజేందర్, రాజు, సురేష్, వేణుగోపాల్‌రెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లేష్, శంకరయ్యగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, విజయేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జంగయ్య, నాగార్జునా, జగన్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు

పీఆర్టీయూ టీఎస్ నేతల ఆధ్వర్యంలో..

చంపాపేట: రెండు దశాబ్దాల పాటు పెండింగ్‌లో ఉన్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రెడేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి చేయించడం పట్ల పీఆర్టీయూ టీఎస్ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హస్తినాపురం డివిజన్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీఆర్టీయూ టీఎస్ వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చంచిరెడ్డి అనంతరెడ్డిలు హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంతరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉమకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర గౌరవ సలహాదారు గజ్జెల జనార్దన్‌రెడ్డి, యుగెంధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆందోళన

వనస్థలిపురం, జూన్ 23(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీ పాపిరెడ్డి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాలనీవాసులు ఆదివారం కాలనీల్లో రోడ్లపై నిలిచిన వరదనీరు ఎదుట నిలబడి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు టీ.శ్రీశైలం మాట్లాడుతూ పదేళ్ల క్రితం జీహెచ్ఎంసీ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ఏర్పడిన శ్రీ పాపిరెడ్డి కాలనీవాసులు జీహెచ్ఎంసీకి అన్ని రకాల పన్నులు కడుతున్నా కూడా తమకు కావాల్సిన కనీస సదుపాయాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు విఫలం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీలో ఉన్న తమ కాలనీకి గ్రామపంచాయితీల కంటే అధ్వానంగా సౌకర్యాలు కల్పిస్తున్నారని వాపోయారు. పది సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులు తమని కేవలం ఓటు బ్యాంక్ లాగానే చూస్తున్నారని, తమకు న్యాయంగా అందాల్సిన సదుపాయాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు జె.బాలునాయక్, పి.సోమయ్య, సుదర్శన్‌రెడ్డి, రాఘవేందర్, వి.వేంకటేశ్వర్‌రావు, ఉదయశ్రీ, ఉమావతి, సాంబయ్య, దేవదాసు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్ర పటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సామ రంగారెడ్డి

వనస్థలిపురం, జూన్ 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్‌లోని 299, 300ల బూత్ వద్ద బూత్ అధ్యక్షులు రాంరెడ్డి, మధుకర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. సామ రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శ్యామాప్రసాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, నాయకులు రవీందర్‌గౌడ్, నర్సింహారావు, క్రాంతిగౌడ్, లక్ష్మణ్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



శివాజీచౌక్ వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత, తదితరులు

సైదాబాద్, ఐఎస్‌సదన్‌లలో..

సైదాబాద్: సైదాబాద్, ఐఎస్‌సదన్, కుర్మగూడ డివిజన్‌లలో బీజేపీ నాయకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. సైదాబాద్‌లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్, రమణ్‌సింగ్, ఐఎస్‌సదన్ డివిజన్‌లో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, గిరిధర్‌రెడ్డి, కుర్మగూడలో సహదేవ్‌యాదవ్, వెంకట్‌రెడ్డి మొక్కలు నాటారు.



గణేష్ చౌక్ వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ తదితరులు

తుర్కయంజాల్ చౌరస్తాలో..

హయత్‌నగర్: తుర్కయంజాల్ చౌరస్తా వద్ద బీజేపీ ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ క్రమశిక్షణా కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ తదితరులు శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, కౌన్సిలర్ కడారి శ్రీలత అనీల్‌కుమార్, నాయకులు శ్రావన్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మైలారం బాబు పాల్గొన్నారు.

బాధితుడి ఫిర్యాదుపై అలసత్వం

నాగోల్ ఎస్‌హెచ్‌ఓపై చర్య

- సీపీ ఆఫీస్‌కు తాత్కాలిక అటాచ్‌మెంట్

కొత్తపేట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బాధితుడి ఫిర్యాదుపై అలసత్వం వహించిన నాగోల్ ఎస్‌హెచ్ఓ పరశురాంను ఈ నెల 22న సీపీ ఆఫీస్‌కు తాత్కాలిక అటాచ్‌మెంట్ చేస్తూ సీపీ తరుణ్‌జోషీ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 2న ఎల్బీనగర్, ఎన్టీఆర్‌నగర్‌లో సాయినగర్ కాలనీకి చెందిన వీ.మల్లేష్, నరేష్, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనీల్, సాయినగర్‌కు చెందిన జ్యోతి, నాగరాజు, నాగోల్‌కు చెందిన పీ.మనోజ్, సాయినగర్ కాలనీకి చెందిన శశాంక్, సాయినగర్ గుడిసెల్లో ఉండే పవన్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు బాలలు, భరత్‌నగర్‌కు చెందిన దాసరి గౌతం అలియాస్ బద్దు (20) మధ్య గొడవ జరిగింది. గాయపడ్డ గౌతం ఈ నెల 21న నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌హెచ్ఓ పరశురాం కేసు నమోదు చేయడంలో అలసత్వం వహించడంతో బాధితుడు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ తరుణ్ జోషి. పరశురాంను కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. ఫిర్యాదుపై స్పందించడంలో అలసత్వం వహించిన ఎస్ఐ మధు, ఏఎస్ఐ అంజయ్యపై కూడా సీపీ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎల్బీనగర్ డీఐ సుధాకర్‌ను తాత్కాలికంగా నాగోల్ ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వహించాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు.

సాయినగర్‌లో ఏం జరిగిందంటే..

ఎల్బీనగర్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో ఈనెల 2న నిందితులకు, భరత్‌నగర్‌కు చెందిన దాసరి గౌతం అలియాస్ బద్దు(20) మధ్య గొడవ జరిగింది. గతంలో జువెనైల్ అఫెండర్లకు, గౌతంకు గొడవలు జరిగాయి. గౌతంపై ద్వేషం పెంచుకున్న వారు ప్రధాన నిందితుడైన వీ.మల్లేష్‌తో కలిసి ఈనెల 2న ఎన్టీఆర్‌నగర్‌లో గొడవ పడ్డారు. అప్పటినుంచి గౌతం కదలికలను గమనిస్తూ అతడిని అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 6వ తేదీ తెల్లవారుజామున నాగోల్, సాయినగర్ కాలనీలోని ఓ స్నేహితుడి ఇంట్లో ఉన్న గౌతంను బయటకు లాక్కొచ్చి కులం పేరుతో దూర్భాషలాడుతూ టెలిఫోన్ స్తంభానికి కట్టేసి విచక్షణారహితంగా కొట్టారు. బాధితుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.15వేల నగదు తీసుకుని పారిపోయారు. ఈనెల 21న గౌతం నాగోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌హెచ్ఓ స్పందించలేదు. దీంతో పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 22న 8మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు జువెనైల్ అఫెండర్లను రెస్క్యూ హోంకు తరలించారు. నిందితులపై హత్యాయత్నం, కిడ్నాప్, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

ఉల్లంఘనులపై ఉక్కుపాదం

- కేసులు నమోదు.. వాహనాల సీజ్



రాంగ్ సైడ్ డ్రైవింగ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, డ్రంకెన్‌డ్రైవ్‌లో పాల్గొన్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): అతివేగం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనాలు నడపడం, నిబంధనలు పాటించకపోవడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించిన సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు. ఆదివారం రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై 22 కేసులు నమోదు చేసి, 114 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై ఇప్పటివరకు 122 కేసు లు నమోదు చేసి, 631 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపా రు. రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేసేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లో చలాన్లు విధించే దిశగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 385 కేసులు..

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 385 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. సీజ్ చేసిన వాహనాల్లో 292 బైకులు, 11 ఆటోలు, 80 కార్లు ఉన్నాయి. 182 కేసులు కేవలం ఐటీ కారిడార్‌లోనే ఉన్నాయని పోలీసులు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- సహజయోగా రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీకృష్ణ



సహజయోగా ధ్యానం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌరీకృష్ణ, మల్లారెడ్డి, రామ్మోహన్‌రావు

ఎల్బీనగర్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): యోగాతో సపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సహజయోగా రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీకృష్ణ అన్నారు. ఈనెల 28న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న సహజయోగా ధ్యానం పోస్టర్‌ను ఆదివారం ఇండోర్ స్టేడియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాజీ నిర్మలదేవి స్థాపించిన సహజయోగా సుమారు 170 దేశాలలో వ్యాపించి ధ్యాన కేంద్రాలు స్థాపించబడ్డాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది కులమత ప్రాంత వయోబేధం లేకుండా సహజయోగ సాధన చేస్తూ తాము ఎదుర్కొంటున్న శారీరమానసిక భావోద్వేగ సమస్యలను పరిష్కరించుకుంటూ ఆధ్యాత్మికతమైన సంతృప్తిని పొందుతున్నారన్నారు. తెలంగాణలో ఉన్న ప్రతి మనిషికి సహజయోగా ద్వారా వచ్చే ప్రశాంతతను ఆనందాన్ని అందించడానికి హైదరాబాద్ రియలైజేషన్ టూర్‌ను పెద్దఎత్తున నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జూన్ 26 నుండి 30 వరకు సుమారు 500 మంది ప్రతినిధులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి అతిథులు వచ్చి పాల్గొనబోతున్నారని ఆయన తెలిపారు. మాజీ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్‌రావు, సుబ్బిరెడ్డి, కమిటీ సభ్యులు సుప్రజ, సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.

'టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రకటించాలి'

నల్లకుంట, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా గ్రూప్-3, 4 నోటిఫికేషన్‌లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రకటించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు. జనవరి నెలలో తమిళనాడులో 2 వేల టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను అక్కడి ప్రభుత్వం ప్రకటించి నిరుద్యోగులను ఆదుకుందని వారు గుర్తు చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ కంప్యూటర్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాలిగ, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి వివేక్‌లు మాట్లాడారు. గ్రూప్-3, 4 నోటిఫికేషన్లలో ప్రభుత్వం టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.